క్లుప్తంగా

గురుకుల పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాల బాలానగర్ బాయ్స్–1లో 2023–24 సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్ల కోసం ఈ నెల 15 నుంచి 30 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.కల్పన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6,7,8,9 తరగతుల్లో విద్యార్థులకు సీట్లు ఉన్నాయని, 5వ తరగతిలో మైనార్టీలకు 60 సీట్లు, నాన్ మైనార్టీలకు 20 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీలలో, మైనార్టీలకు 60 సీట్లు, నాన్ మైనార్టీలకు 20 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని. ఆఫ్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. జనవరి 30 వరకు అప్లికేషన్లు స్వీకరిస్తామని, వివరాలకు 9140298 1806, 7989486938, 7569241410, 7331170802 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మొండికుంటను అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



మొండి కుంటను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: మాదాపూర్ డివిజన్‌లోని ఖానామెట్‌లో విస్తరించి ఉన్న మొండి కుంటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మంగళవారం మొండికుంట అభివృద్ధి పనులను ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొండి కుంట అభివృద్ధి కోసం కోటి రూపాయల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నామని చెప్పారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా నిర్మిస్తున్న డ్రెయిన్ పనులను వేగవంతం చేయాలన్నారు కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ నళిని, ఏఈ నాగరాజు, ఆర్ఐ శ్రీనివాస్, టీఆర్ఎస్ నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



గచ్చిబౌలి: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఐదవ మహాసభలను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా కార్యదర్శి గొడుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడ జడ్పీహెచ్ఎస్‌లో టీఎస్‌యూటీఎఫ్ 5వ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల 13,14వ తేదీలలో ఇబ్రహీంపట్నం మండలం మన్నెగూడలోని ఎస్ఆర్ సార్థా కన్వెన్షన్‌లో మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవ సభలకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ విద్యాశాఖ మంత్రి కె.కె శైలజ, విశ్లేషకులు ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ శేరిలింగంపల్లి మండల అధ్యక్షులు మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శి మేకల నర్సింహులు, ఉపాధ్యాయులు సురేష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పొదుపుపై విద్యార్థులకు అవగాహన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు పొదుపుపై కళాజాత బృందం అవగాహన కల్పించారు. మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు ప్రశాంత్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీరో అకౌంట్ బ్యాంకులో తీసుకోవడం, బ్యాంకు లావాదేవీలు, పొదుపు తదితర అంశాలపై పాటల తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.శంకర్, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, భాస్కర్, శివకుమార్, శ్రీనివాస్, గోపాల్, రమ ణ కుమారి, ఉదయకుమారి పాల్గొన్నారు.

అసంపూర్తి సీసీ రోడ్లను పూర్తి చేయాలి

గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని బంజారానగర్‌లో అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్లను పూర్తి చేయాలని స్థానికులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతి పత్రం సమర్పించారు. మంగళవారం ఎమ్మెల్యేను కలిసి అసంపూర్తి రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బంజారానగర్ వాసులు రవి శంకర్ నాయక్, సుదర్శన్, చిట్టిబాబు, పరుశురామ్, రాజు,నర్సింహా, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం వృథాగా విలువైన తాగునీరు

- పైపులైన్ల లీకేజీలతో వృథాగా పోతోన్న తాగునీరు
- మురుగు చేరి కలుషిత నీరు సరఫరా అవుతోన్న వైనం
- ఫిర్యాదులకు స్పందించని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఆల్విన్‌కాలనీ: కలుషిత తాగునీటి సరఫరాతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్‌లో ప్రతి కాలనీలో తాగునీటి పైపులైన్ల లీకేజీ కారణంగా గుగునీరు రోడ్లపాలు అవ్వడంతో పాటు కలుషిత నీరు సరఫరా అవుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అవసరాలను గుర్తించి సుదూర ప్రాంతం నుంచి నగరానికి తీసుకువస్తున్న తాగునీరు వృథాగా పోవడం పట్ల ప్రజలు మండిపడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కింది స్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో తాగునీరు రోడ్లపాలవుతుందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లలో చెత్తా చెదారం పేరుకుపోవడంతో మురుగు నీరు సరఫరా అవుతోందని, కనీస అవసరాలకు సైతం వాడుకునేందుకు వీలు లేదని చెబుతున్నారు.



పైపులైన్ రోడ్డులో ప్రధాన పైపులైన్‌కు లీకేజీ దృశ్యం

ఇప్పటికైనా ఉన్నతాధికారులు కాలనీలో పర్యటించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డులోని బ్రిడ్జిపై ఉన్న ప్రధాన పైపులైన్ లీకేజీ కారణంగా మురుగు, చెత్తా చెదారం చేరి కలుషిత నీరు సరఫరా అవుతోంది. మరమ్మతులు చేయాలని అనేకసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు చెబుతున్నారు.
- కూకట్‌పల్లి, జగద్గిరిగుట్ట ప్రగతినగర్‌లో పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతోందని, ప్రతి రోజూ నీరు విడుదల చేసే సిబ్బందికి చెప్పినా పట్టించుకోవటం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.
- ఆస్‌బెస్టాస్ కాలనీ ప్రధాన రహదారిలోని వాటర్ ట్యాంక్ వద్ద పైపులైన్ వాల్వ్ లీకై నీరంతా వృథాగా పోతోంది. రోడ్లపై నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.
- రిక్షాపుల్లర్స్ కాలనీలో నల్లాలు విప్పిన ప్రతి రోజూ నీటిని వృథాగా వదిలివేస్తున్నారు. నిర్దేశిత సమయం తర్వాత నల్లాలు కట్టేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తాగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని పలు సంక్షేమ సంఘాల సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



కలుషిత నీరు సరఫరా విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాలి. కాలనీల్లో నల్లాలు విప్పి ఇంటింటికి నీటిని చేరవేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విలువైన తాగునీరు రోడ్లపాలవుతోంది. అధికారులు లీకేజీలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలి.

–శ్యామ్, రిక్షాపుల్లర్స్ కాలనీ



ప్రగతినగర్‌లో పైపులైన్ లీకేజీతో వృథాగా పోతోన్న తాగునీరు



రిక్షాపుల్లర్స్ కాలనీలో..



ఆస్‌బెస్టాస్ కాలనీలో వాల్వ్ లీకేజీతో రోడ్డుపాలవుతోన్న తాగునీరు

జీహెచ్‌ఎంసీకి స్థలం కేటాయించడంపై హర్షం



ఎమ్మెల్యే కృష్ణారావును సన్మానిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, కాలనీవాసులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ 9వ ఫేజులోని రెండున్నర ఎకరాల భూమిని జీహెచ్‌ఎంసీకి కేటాయించడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావుతో ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సత్కరించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. వేల కోట్ల రూపాయలతో కేపీహెచ్‌బీ డివిజన్‌ను అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేయడంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేకు తిరిగి గెలిపించుకుంటామని చెప్పారు.

తులసినగర్ కాలనీ అసోసియేషన్ సమావేశం

మోతీనగర్: తులసినగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం కాలనీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తులసినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సామ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. రెండవసారి తులసినగర్ ప్రజలకు సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సబిహా బేగం, అధికారుల సహకారంతో ఇప్పటి వరకు 90 శాతం భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించి సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. నూతన కమిటీని జనవరి 22న ఎన్నుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో బి.సాంబయ్యగౌడ్, సీహెచ్.బంగారునేత, ఎ.శ్రీనివాస్, ఎస్.శేఖరాచారి, ఎం.సత్తమ్మ, రాములు, ఎల్లయ్య, భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్, దేవయ్య, రమేష్, కిషన్‌సింగ్, కృష్ణమూర్తి, సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి తదితరులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



మాస్ క్లీనింగ్ డ్రైవ్‌లో పాల్గొన్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ సిక్కుల బస్తీ వద్ద ఉన్న వెటర్నరీ హాస్పిటల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసేందుకు జీహెచ్‌ఎంసీ, రాంకీ గ్రూపు వారు నిర్వహించిన మాస్ క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమంలో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకుండా కాలనీవాసుల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాల బారిన పడకుండా ఉంటామని, చెత్తను వీధుల్లో, కాలువల్లో వేయొద్దన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోవారికి అందజేయాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, రాములుగౌడ్, జోనల్ హెడ్ రామకృష్ణారెడ్డి, సర్కిల్ ఇన్‌చార్జి సంతోష్, ఎస్ఆర్‌పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేస్తాం



పీజేఆర్ నగర్ పర్యటనలో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ఎల్లమ్మబండ, పీజేఆర్ నగర్‌లో మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పాదయాత్ర చేశారు. కాలనీలో డ్రైనేజీ, రోడ్ల పెండింగ్ పనులు ఉన్నాయని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజేఆర్ నగర్‌లో అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయని, పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్ల పనులను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, షౌకత్‌అలీ మున్నా, అగ్రవాసు, రాములుగౌడ్, మౌలానా, సంగమేష్, యాదగిరి, రాజుపటేల్, వాసుదేవరావు, పోశెట్టిగౌడ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మాస్టర్స్ అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ

మియాపూర్: మెదక్‌లోని ఇందిరానగర్ స్టేడియంలో ఈ నెల 21, 22వ తేదీలలో నిర్వహించే 8వ రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో రంగారెడ్డి మాస్టర్లు అధిక సంఖ్యలో పతకాలు సాధించడం ఖాయమని రంగారెడ్డి జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు కొండా విజయ్‌కుమార్ పేర్కొన్నారు. చందానగర్‌లో రంగారెడ్డి జిల్లా మాస్టర్ అసోసియేషన్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కొండా విజయ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మాస్టర్లకు 11వ తేదీ నుండి చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

‘అక్రమ కట్టడాలను అధికారులు ప్రోత్సహిస్తున్నారు’



డా.సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని, దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని టీపీసీసీ సభ్యుడు డా.సత్యం శ్రీరంగం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అవసరమైతే అక్రమ కట్టడాలపై కోర్టుకు వెళ్తామన్నారు. ప్రజల మేలు కోరి తెచ్చిన టీఎస్ బీపాస్ చట్టాన్ని అమలు చేయడంలో సర్కిల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఈ చట్టంలోని కొన్ని వెసులుబాట్లను అనుకూలంగా మలుచుకొని అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇదే అదనుగా బిల్డర్లు అనుమతి పొందిన దానికంటే ఎక్కువ అంతస్థులు నిర్మిస్తున్నారన్నారు. కూకట్‌పల్లి సర్కిల్ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ అంతస్థుల వల్ల నిర్మాణ దశలోనే బిల్డింగ్‌లు కూలిపోతున్నట్లు తెలిపారు. గతంలో ఫిర్యాదు చేస్తే అక్రమ నిర్మాణాలను కూల్చివేసేవారని, ప్రస్తుతం టీఎస్‌బీపాస్ చట్టం వచ్చిన తర్వాత ఫిర్యాదులు స్వీకరించడంలో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వినతి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని రామారావు కాలనీ చిత్తారమ్మతల్లి దేవాలయం దారిలోని చౌరస్తాలో ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించాలని కోరుతూ మంగళవారం కూకట్‌పల్లి ట్రాఫిక్ సీఐ ఎన్.నాగేష్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన సీఐ తక్షణమే ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు కె.వేణు, పి.బాలుయాదవ్, లక్ష్మణ్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



సీఐ నాగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో పాల్గొన్న జెడ్సీ మమత, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో మంగళవారం జోనల్ కమిషనర్ వి.మమత ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో జిమ్, థీమ్ పార్కుల పనులు వేగవంతం చేసి నెలాఖరులోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పనులను త్వరితగతిన పూర్తి అయ్యేలా సంబంధిత కాంట్రాక్టర్ చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.చిన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ముగ్గుల పోటీలు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్స్‌లో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, నియోజకవర్గ బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై ముగ్గులను తిలకించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, వినోద్‌కుమార్, ఓబీసీ మహిళా మోర్చా నాయకులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాంతారావు, రాజేశ్వరరావు తదితరులు

క్రైం కార్నర్

రోడ్డుపై కారు బోల్తా.. తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

కేపీహెచ్‌బీకాలనీ: వేగంగా వెళ్తున్న కారు పల్టీ కొట్టిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. వరంగల్ పట్టణానికి చెందిన దైద క్రాంతికుమార్ (27) మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో తన కారులో షేక్‌పేట నుంచి హైటెక్ సిటీ మీదుగా కేపీహెచ్‌బీ కాలనీవైపు వస్తున్నాడు. మద్యం మత్తులో వేగంగా కారు నడపడంతో కేపీహెచ్‌బీ రైల్వే ఓవర్ బ్రిడ్జిపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో పల్టీ కొట్టింది. అదృష్టవశాత్తు కారు నడుపుతున్న క్రాంతికుమార్‌తో పాటు కారులో ఉన్న యువతికి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు క్రాంతికుమార్ మద్యం తాగి ఉన్నట్లు గుర్తించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కేలండర్ ఆవిష్కరణ

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన సంవత్సర కేలండర్, డైరీలను మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంటీ హిల్స్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.గాంధీరావు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఆర్ మూర్తి, సెక్రటరీ గోపిచంద్ తదితరులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, అసోసియేషన్ సభ్యులు

పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో..

కూకట్‌పల్లి: పీఆర్‌టీయూటీఎస్ కూకట్‌పల్లి మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరేందర్‌గౌడ్, పర్మగళ్ల నర్సింహులు పాల్గొని మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసే సంఘం పీఆర్‌టీయూటీఎస్ అన్నారు. అనంతరం మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి యూనియన్ కేలండర్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేందర్ రెడ్డి, జయరాజ్, రమేష్, విఠల్, మండల అసోసియేట్ అధ్యక్షుడు హరీష్, విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూటీఎస్ నాయకులు

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న హస్తకళా ప్రదర్శనలో భాగంగా మంగళవారం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఒగ్గు ప్రవీణ్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన, ప్రముఖ కూచిపూడి నాట్య గురువు రాజనాల శ్రీదేవి కుమార్తె నందిత లక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనలతో సందర్శకులను అలరించారు.

